క్లుప్తంగా

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

– డివిజనల్ ఇంజినీర్ గంగాధరం

మదనపల్లె : మదనపల్లె డివిజన్‌లోని గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు చెల్లించాల్సిన డెవలప్‌మెంట్ చార్జీలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పించిందని డివిజనల్ ఇంజినీర్ గంగాధరం తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీవరకు అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. దీనికి సంబంధించి 1కిలోవాట్‌కు అదనపులోడ్ క్రమబద్ధీకరణకు గతంలో డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2,000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, అప్లికేషన్ ఫీజు రూ.50 చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం రాయితీ అమలులో డెవలప్‌మెంట్ చార్జీలు రూ.1,000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, అప్లికేషన్ ఫీజు రూ.50 చొప్పున రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందన్నారు. గృహ విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ బిల్లు, ఆధార్‌కార్డు తీసుకుని సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి వెళ్లి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

సెక్యూరిటీ గార్డుపై చర్యలు తీసుకోవాలి

పీలేరురూరల్ : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మద్యం సేవించి విధులకు హాజరైన సెక్యూరిటీ గార్డుపై చర్యలు తీసుకోవాలని డీబీఎస్‌ఎఫ్, ఏబీఎంఎస్ జేఏసీ, ఎస్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు భానుప్రకాష్, అమృతతేజ, నరేష్, నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు మద్యం సేవించి విధులకు హాజరు కావడం వల్ల ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఆయనపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పోలీస్‌స్టేషన్ తనిఖీ

రామసముద్రం : మండల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, రౌడీయిజం ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు, జనజీవనానికి ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే ఎంతటివారైనా సహించేది లేదన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రశాంత జీవన విధానంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామం చీకిరాల బర్నేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సి.గణేష్ తండ్రి సి.క్రిష్ణయ్య(70) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం ఉదయం చీకిరాల బర్నేపల్లికి చేరుకుని క్రిష్ణయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాము, పద్మనాభయ్య, మహేంద్రరెడ్డి, హరి, నాగభూషణ, వార్డు సభ్యుడు చంద్రయ్య, వెంకటస్వామి, క్రిష్ణయ్య తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ప్రైవేట్ ఉద్యోగి మృతి


శశికుమార్ నాయుడు (ఫైల్)

మదనపల్లె : టిప్పర్ ఢీకొని ప్రైవేట్ ఉద్యోగి దుర్మరణం పాలైన ఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ కమ్మ గోవిందుపల్లెకు చెందిన రాజన్ననాయుడు, రెడ్డెమ్మ దంపతుల కుమారుడు దద్దాల శశికుమార్‌నాయుడు(33) బీటెక్.పూర్తిచేసి బెంగళూరులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితుడిని డ్రాప్ చేసేందుకు మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ నవోదయకాలనీకి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా, మదనపల్లె బైపాస్‌రోడ్డు వై జంక్షన్ సమీపంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీ కొంది. శశికుమార్ శరీరంపై టిప్పర్ దూసుకెళ్లడంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

రామసముద్రం : మండలంలోని గుంతలపేట గ్రామానికి చెందిన శ్రీనివాసులు గడ్డివాముకు మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపు కాకపోవడంతో పుంగనూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో వరిగడ్డి వామి, రాతికూసాలు, ఐరన్‌షీట్లతో కప్పబడిన షెడ్డు అగ్నికి గురై రూ.50వేలు నష్టం జరిగినట్లు అంచనావేశారు. మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 9 మంది అనుమానితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

టమాటా మార్కెట్‌లో నాలుగు వరుసల క్రేట్స్

- పొలాల్లోనే గ్రేడింగ్ చేసుకుని రావాలని రైతులకు సూచన
- జాక్‌పాట్, దోపిడీ విధానాలకు స్వస్తి
- రైతు శ్రేయస్సే ధ్యేయంగా మార్కెట్ కార్యకలాపాలు


నాలుగు వరుసల విధానంలో వేలం నిర్వహిస్తున్న మండీ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : టమాటా క్రయవిక్రయాలకు దేశంలో పేరుమోసిన మదనపల్లె టమాటా మార్కెట్‌లో రైతులకు లాభం కలిగించేలా నాలుగు వరుసల క్రేట్స్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్, మండీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సురేంద్ర తెలిపారు. బుధవారం మార్కెట్‌లో నాలుగు వరుసల క్రేట్స్ విధానంలో వేలం పాటలు నిర్వహించారు. గతంలో అమలుచేస్తున్న జాక్‌పాట్, దోపిడీ విధానాలకు స్వస్తి పలుకుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మార్కెట్‌లో ఇంతకుముందు రెండు వరుసల విధానం అమల్లో ఉండటంతో, సరైన గ్రేడింగ్ లేకపోవడం, జాక్‌పాట్‌తో రైతులు నష్టపోవడం జరిగేదన్నారు. 100 కిలోల టమాటా మార్కెట్‌కు రైతు తీసుకువస్తే, 80 కిలోలు అయ్యేవన్నారు. దీనిపై పలుమార్లు రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడంతో, మార్కెట్‌కమిటీ శ్రేయస్సు దృష్ట్యా ఐదురోజుల క్రితం నూతనంగా ఏర్పాటైన మండీ ఓనర్స్ అసోసియేషన్‌తో చర్చించడం జరిగిందన్నారు. వ్యాపారులు, మండీ యజమానులు ఏకాభిప్రాయంతో నాలుగు వరుసల విధానం అమలుకు అంగీకరించడంతో ఆచరణలో పెట్టామన్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాల్లోనే కాయలను గ్రేడింగ్ చేసుకుని మార్కెట్‌కు తీసుకురావాలన్నారు. ఈ విధానంలో నాణ్యత కలిగిన కాయలకు మంచిధర పలుకుతుందన్నారు. ఈ విధానంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని, మార్కెట్‌కమిటీలో రైతుల శ్రేయస్సుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. మదనపల్లె మార్కెట్‌లో సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువచ్చి, లాభాలు పొందడంతో పాటు మార్కెట్‌కమిటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ తూకం సక్రమంగా ఇవ్వాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి


కస్తూర్బా పాఠశాలలో వంట రుచిచూస్తున్న రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి

తంబళ్లపల్లె : చౌకదుకాణాలకు బియ్యం గోడౌన్ నుంచి బియ్యం తూకాలు సక్రమంగా పంపిణీ జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి, డీఎస్‌ఓను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని కుక్కరాజుపల్లె 17వ నెంబర్ చౌకదుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ నిల్వ, పంపిణీ తదితర అంశాలపై డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ వద్దకు డీలర్లే వెళ్లి బియ్యం తూకం సక్రమంగా తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలతో ముచ్చటించారు. రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా ఉండటంతో, ఏ జిల్లాలో కూడా రికార్డులు ఈ తరహాలో నిర్వహించడం లేదని, ఈ మండలంలో చాలా బాగున్నాయని అంగన్‌వాడీ కార్యకర్త సునీతను, సీడీపీఓ నాగవేణిని అభినందించారు. ఇదేతరహాలో మిగిలిన కేంద్రాలు నిర్వహించాలన్నారు. అనంతరం తంబళ్లపల్లె బియ్యం గోడౌన్‌ను తనిఖీ చేశారు. తర్వాత గిరిజన బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. పిల్లలకు మాంసం, కోడిగుడ్లు తక్కువగా ఇస్తున్నటు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంగనాయకులు తెలపడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. జిల్లా అధికారికి ఫోన్ చేసి అతడికి మెమో ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఆయన వెంట డీఎస్‌ఓ రఘురామ్, తహసీల్దార్ హరికుమార్, ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కురబలకోట: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సి.విజయ ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన మండలంలోని మట్లివారిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రం, ముదివేడు దగ్గరున్న కేజీబీవీ స్కూల్, పక్కనే ఉన్న మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ముదివేడులోని జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను సవాల్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమైనదన్నారు. ఉన్నత చదువులకు ఈ మార్కులను బట్టే ప్రవేశం ఉంటుందన్నారు. విద్యార్థి దశలోనే కొత్త ఆలోచనలతో మెలగాలన్నారు. నిర్దిష్ట ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. సమయాన్ని వృథా చేయవద్దన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తానన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు, కూలీలు

మదనపల్లె : గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించి, వలసలు నివారించే ప్రయత్నం చేయాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుకృష్ణప్ప డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం, బీకేఎంయూ రాష్ట్ర సమితి పిలుపుమేరకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుకృష్ణప్ప మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున వ్యవసాయ కూలీలు పేదలు వలసబాట పట్టారన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వేసి వలసలు వెళ్లారన్నారు. గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యాయన్నారు. వ్యవసాయ కూలీలకు జీవించే హక్కును కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధిహామీ చట్టాన్ని పారదర్శకంగా అమలుచేయాలన్నారు. చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు జీవనం కష్టమవుతున్న సమయంలో ఉపాధిహామీ చట్టంను మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించి, వలసలను నివారించాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలన్నారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. జాబ్‌కార్డుతో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలన్నారు. ఉపాధిహామీతో చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించడమే కాకుండా పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో రాజకీయజోక్యాన్ని ముఖ్యంగా అధికారపార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించాలన్నారు. అలాగే రాయలసీమ ప్రాంతంలో విద్యార్థులు చదువులు పూర్తిచేస్తున్నప్పటికీ ఉద్యోగావకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి షేక్‌ముబారక్, ఏఐటీయూసీ తిరుమల, వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.చంద్రశేఖర్, మునికాటయ్య, బాలు, కుమారి, లక్ష్మమ్మ, రామప్ప, రెడ్డెప్ప, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయిముఠా సభ్యులు అరెస్ట్

గుర్రంకొండ: ఎట్టకేలకూ ముగ్గురు గంజాయి ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి ముఠా స్థానిక మార్కెట్ యార్డు వద్ద పెద్ద ఎత్తున గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం అందుకొన్న బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో గుర్రంకొండ పట్టణానకి చెందిన గంజాయి ముఠా సభ్యులు కే. ఆదిల్(21), ముదివేడు కమాల్‌ఖాన్(36)బి.రెడ్డికుమార్(20) లను అదుపులోకి తీసుకొన్నట్లు వాల్మీకిపురం సీఐ ప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డు వద్ద ముఠాసభ్యుల్ని విచారించి వారి వద్ద నుంచి ఒక కేజి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక మోటర్‌సైకిల్ స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన పేర్కొన్నారు. ముగ్గుర్ని అరెస్ట్ చేసి వాల్మీకిపురం కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మధురామచంద్రుడు, వీఆర్వోలు భరత్, అమీర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ ద్వారా ఆదాయం పెరగాలి

కలకడ : జిల్లాలోని ప్రతి పంచాయతీలో చెత్తసేకరణ ద్వారా ఆదాయం పెరగాలని జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి.మస్తాన్‌వలి అన్నారు. బుధవారం కలకడ చెత్త సేకరణ కేంద్రం వద్ద నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. వారికి యూనిఫాం అందజేసి చెత్త సేకరణ, ఆదాయ మార్గాలను సూచించారు. డివిజన్ పరిధిలోని 33పంచాయతీలోని సిబ్బంది, కార్మికులకు ఒక్క రోజు శిక్షణ తరగతులు కలకడలో నిర్వహించారు. రైతులు పండించే పంటలకు సైతం కల్తీలేని సేంద్రీయ ఎరువులు పంచాయతీ చెత్తసేకరణ కేంద్రాలలో తయారు చేసి అందించే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవోలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లు, చెత్తసేకరణ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

- చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టాలి
- ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కలకడ : ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో తహసీల్దార్ ఫనికుమార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్, అంగ్ విజలెన్స్‌కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా విజలెన్స్‌అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ గత సమావేశంలో మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ తోటిపల్లె ఎస్సీ కాలనీలో విద్యుత్ సర్వీస్ వైర్లు ప్రమాదకంగా కిందకు ఉన్నాయని సభ్యులు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉన్నతాధికారులు ఆదేశించినా స్పందించరా అని ప్రశ్నించారు. కలకడ ఇందిరమ్మ కాలనీలోని సర్వేనెంబర్ 1136లో ప్రభుత్వం బడికి, గుడికి, అంగన్‌వాడీ కేంద్రానికి, ఆట స్థలం కోసం కేటాయించిన భూమిలో కూడా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ స్పందిస్తూ అక్కడ ఎలాంటి పట్టాలు మంజూరు చేయలేదని, వెంటనే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కలకడ ప్రభుత్వ పశువుల ఆసుపత్రికి కేటాయించిన ప్రభుత్వ స్థలం సైతం కబ్జాకు గురైనట్లు తెలిపారు. క్యాటిల్‌ఫాండ్ అనిమతి కొందరికేనా అని ఏపీఓను సభ్యులు ప్రశ్నించారు. కేవలం మూడు పంచాయతీలలో మాత్రమే మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన అన్ని గ్రామాలలో రైతుల విన్నపం మేరకు మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని ఏపీఓ చెన్నకేశవులు తెలిపారు. రాతిగుంటపల్లె పంచాయతీలో అర్హత ఉన్నా డప్పు కళాకారులకు, వృద్ధులకు పింఛన్‌లు రద్దు చేసినట్లు మాజీ సర్పంచ్ ధార వెంకట్రమణ ఆవేదన వ్యక్తం చేశారు. దేవులపల్లె హరిజనవాడలో నీటి ఎద్దడి అధికంగా ఉన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అంబేద్కర్ విగ్రహం, భవనం కోసం స్థలం కేటాయించాలని కోరారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు కేటాయించిన స్మశాన వాటికలకు హద్దులు చూపి ఆక్రమణలు లేకుండా సంరక్షణ బాధ్యత పంచాయతీలకు అప్పగించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఏఈలు నాగమునినాయక్, సాగర్, ప్రజా సంఘాల సభ్యులు బీజీ,రమణ, రజిని,రెడ్డికిరణ్, శ్రీనివాసులు, నరసింహులు, దామోదర్, మల్లికార్జున, నటరాజ్, లోకేష్, ఓబులేశు, జివి రమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయిని విరాళం


విరాళం అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు

మదనపల్లె : పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మాయాబజార్ వివేకానంద మున్సిపల్ ఉన్నతపాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయురాలు పుష్పకుమారి పాఠశాల అవసరాలకు రూ.10వేల విరాళాన్ని అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం వెంకటరమణను కలిసి నగదను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...చేనేత, దినసరి కార్మికులు అధికంగా నివసిస్తున్న నీరుగట్టువారిపల్లెలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో వివేకానంద మున్సిపల్ హైస్కూల్ విశేష కృషి చేస్తోందని కొనియాడారు. ప్రతి ఏడాది పదోతరగతి, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా మంచి ఉత్తీర్ణతను సాధిస్తోందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును అందించాలనే సదుద్దేశంతో పాఠశాల హెచ్ఎం పురం వెంకటరమణ, ఉపాధ్యాయ బృందం అందిస్తున్న సేవలు విలువైనవని కొనియాడారు. ఈ సందర్భంగా హెచ్ఎం, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయురాలు పుష్పకుమారి దాతృత్వాన్ని ప్రశంసించారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం


రామ్మోహన్‌రావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పీలేరురూరల్ : ఆర్టీసీ కార్మికుల సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) నిరంతర పోరాటం సాగిస్తుందని యూనియన్ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక డిపో ప్రాంగణంలో ఎన్ఎంయూ వ్యవస్థాపక అధ్యక్షులు పి. రామ్మోహన్‌రావు 20వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయూ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు యల్లయ్య, కె.కె. నాయుడు, ఆదినారాయణ, బి.ఆర్.బి. నాయక్, హెచ్ఎం. నాయుడు, రామయ్య, ఈశ్వరయ్య, రామచంద్ర, ప్రతాప్, గోపాల్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె మండలం తట్టివారిపల్లెకు చెందిన భాస్కర్, కల్పన దంపతుల కుమారుడు సుమిత్‌కుమార్(13) పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ట్యూషన్ వెళ్లేందుకు సైకిల్‌పై పక్కనే ఉన్న పుంగనూరువాండ్లపల్లెకు వెళుతుండగా, ఎదురుగా వచ్చిన కారు సైకిల్‌ను ఢీకొనడంతో సుమిత్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ ఓబులరెడ్డిగారిపల్లెకు చెందిన నారాయణ కుమారుడు జ్ఞానానంద్(17) పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చాడు. మరో స్నేహితుడితో కలిసి బెంగళూరు రోడ్డులో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. అనంతరం పరీక్ష రాసేందుకు వెళుతుండగా, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్సలు పొందాడు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని పానీపూరి వ్యాపారికి..

నిమ్మనపల్లె : పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం తమ్మినాయునిపల్లెకు చెందిన శ్రీనివాసులు, మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మకాలనీ పెట్రోల్‌బంక్ వద్ద పానీపూరి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బుధవారం భార్యతో కలిసి ద్విచక్రవాహనంలో వస్తుండగా రెడ్డివారిపల్లె పంచాయతీ పిట్టావాండ్లపల్లె వద్ద వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు.

దాడిచేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

– బ్రాహ్మణసంఘాల డిమాండ్


మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

రామసముద్రం : వాలీశ్వరస్వామి వంశపారంపర్య అర్చకుడికి మద్దతుగా మాట్లాడినందుకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తిపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం తగదని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణసంఘ ప్రతినిధులు, అర్చకులు డిమాండ్ చేశారు. బుధవారం రామసముద్రంలోని శ్రీ లక్ష్మీ జనార్ధనస్వామి ఆలయం వద్ద బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథ్ దీక్షితులు మాట్లాడుతూ వంశపారంపర్యంగా వస్తున్న అర్చకులపై జరిగిన అన్యాయంపై తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం సమర్పించిన సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, మండల అధ్యక్షులు ఆనందనాయుడు మద్దతు తెలిపారన్నారు. అర్చకునికి జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ మద్దతు తెలిపినందుకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తిని దారిలో అడ్డగించి టీడీపీ నాయకులు దాడి చేయడం సమంజసం కాదన్నారు. దాడిచేసిన వ్యక్తులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలస్వామి, తిన్నలిస్వామి, అనిల్‌స్వామి, ప్రసాద్, మంజునాథ్, మణికంఠ, సోము తదితరులు పాల్గొన్నారు.

తవళం పంచాయతీకి రూ.27.10 లక్షల ఆదాయం

– డీఎల్‌పీఓ నాగరాజ


వేలం నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజ

నిమ్మనపల్లె: కలప సేకరణకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా తవళం పంచాయితీకి రూ.27.10 లక్షల ఆదాయం సమకూరినట్లు మదనపల్లి డీఎల్‌పీఓ నాగరాజ తెలిపారు. బుధవారం స్థానిక తవళం సచివాలయం వద్ద ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, ఈవోపీఆర్డి చలపతిరావు, ఏవో రమేష్ బాబు, అటవీశాఖ డీఆర్‌ఓ మదనమోహన్, సర్పంచ్ కె.రెడ్డప్ప, సమక్షంలో, డీఎల్‌పీఓ నాగరాజ తవళం పంచాయతీ కోమటివాని చెరువు వద్ద ఉన్న నీలగిరి చెట్ల కలప సేకరణ కోసం బహిరంగ వేలం నిర్వహించారు. 24 మంది పాటదారులు ఒక్కొక్కరు రూ.2లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెంకు చెందిన సయ్యద్ బాషా అత్యధికంగా రూ.27.10 లక్షలకు వేలం దక్కించుకున్నారు. వేలంలో హెచ్చు పాటదారుడు నిర్దేశించిన సమయం లోగా, పూర్తిస్థాయిలో నగదు చెల్లించిన వెంటనే నీలగిరి చెట్లను కోసి, కలప సేకరించేందుకు పంచాయతీ తగిన అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. వేలం ద్వారా సమకూరిన ఆదాయం పంచాయతీ అభివృద్ధికి ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ రమేష్ బాబు, ఇన్ ఛార్జ్ పంచాయతీ కార్యదర్శి మారెప్ప, ఎఫ్.బి.ఓ దీప, టిడిపి నాయకులు రాజన్న, మేష రామకృష్ణ, శ్రీపతి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని అనపగుట్ట రింగ్‌రోడ్‌కు చెందిన నాసిర్‌బాషా కుమారుడు షారుక్(28) కూలిపనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి తనకు పెళ్లి చేయకపోవడంపై కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉన్న కత్తి తీసుకుని గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ బచ్చనిచెరువు గ్రామంకు చెందిన భవననిర్మాణ కార్మికుడు సుధాకర(45) కుటుంబసమస్యలతో భార్యతో గొడవపడి మనస్తాపం చెంది తమ ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన సురేష్‌కుమారుడు పవన్(18) ఇంటర్ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నాడు. నెలరోజులుగా జులాయిగా తిరుగుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది పవన్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఎంఎస్‌పీ నాయకుడు వెంకటేష్

పీలేరు : ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నియోజకర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు పింఛన్లు ఇప్పించడానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ విశేష కృషి చేశారని తెలిపారు. ప్రత్యేక ప్రతిభా వంతులు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి ఐక్యమత్యంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ సీనియర్ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, చిన్నరెడ్డెప్ప, సుభాష్, అమరనాథరెడ్డి, మహేష్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక గొర్రెల కాపరి ఆత్మహత్య

గుర్రంకొండ : అప్పుల బాధ తాళలేక గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన వి.శ్రీనివాసులు(48) గొర్రెలు కాచుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ నిమిత్తం అప్పులు చేశాడు. అప్పుల వాళ్ల బెడద ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందాడు. గత మంగళవారం రాత్రి గ్రామానికి సమీపంలోని సొంత పొలం వద్ద ఉన్న చింతచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.